"స్వామీ! మీరేం బోధించదలచుకున్నారో నాకు అర్థం కాలేదు?" సందేహంగా అడిగాడు కుటుంబ పెద్ద.

"ఒకే వస్త్రం. దాన్ని తలకి చుడితే తలపాగా అంటాం. మొలకి చుడితే పంచె అంటాం. భుజాన వేసుకుంటే ఉత్తరీయం. అలాగే ఉన్నది ఒకే దైవం. దానికి విలాసవంతమైన భోగరూపం వేస్తే అమ్మవారంటాం. పురుష రూపం వేస్తే వెంకటేశ్వర స్వామి అంటాం. క్రోధరూప అలంకరణని కాళిక అంటాం. శాంత రూపాన్ని వేస్తే లలిత అంటాం. మనకి నచ్చిన ఏ ఒక్క రూపాన్నో మనసులో పెట్టుకుని కొలిస్తే చాలు." వివరించాడాయన.

కుటుంబ పెద్దకి విషయం అర్థమైంది.

## 21. కమ్మరి - వీరుడు

చిన్నప్పటినించీ రామకృష్ణకి ఆధ్యాత్మిక జిజ్ఞాస అధికం. అతను అందుకు సంబంధించిన అనేక గ్రంథాలు చదివాడు. చాలా విషయాల్లో అతను విరాగి. ఓసారి పుస్తకాల షాపుకి వెళ్తే, సేల్స్‌మేన్ ఓ పుస్తకం అతని చేతిలో పెట్టి చెప్పాడు.

"ఓ కొత్త పుస్తకం వచ్చింది. చాలా బావుందంటున్నారంతా."

'స్వామి ప్రణవానంద' రాసిన ఆ పుస్తకంపై అంతకుముందే సమీక్ష చదివి వుండటంతో రామకృష్ణ దాన్ని కొని చదివాడు. అది చదివిన ప్రతీవారికి దైవం మీద మనసు లగ్నమై, లౌకిక విషయాలపై వైరాగ్యభావం ఏర్పడేంత పటిష్టంగా సాగిందా రచన. ఆద్యంతం ఏకబిగిన చదివాక రామకృష్ణ 'ఆయన ఎంత మహాజ్ఞానో కదా? అలాంటివారి దర్శనం పుణ్యప్రదం' అనుకుని ఆ గ్రంథ రచయితని కలుసుకోవాలనుకున్నాడు.

ఆయన చిరునామా పబ్లిషర్ ద్వారా సంపాదించి ఓ రాత్రి పగలు రైల్లో ప్రయాణించి, ఆయన వుండే ఊరు చేరుకున్నాడు. ఆయన గృహస్థు అని తెలిసి విస్మయంగా అడిగాడు.

"అదేమిటి? మీరు సన్న్యాస నామంతో పుస్తకం రాసారే మరి?"

"నిజమే. అప్పలరాజు పేరుతో కంటే, స్వామి ప్రణవానంద పేరుతో రాస్తే, అమ్మకాలు ఎక్కువుంటాయని ఆ పేరుతో రాసాను."

సామాన్యుల్లా అయనా విషయ లంపటంలో, లౌకిక వ్యవహారాల్లో మునిగి తేలుతున్నాడని గ్రహించిన రామకృష్ణ అడిగాడు.

"రాజుగారూ, సాధారణంగా నిప్పు, నీరు ఎలా కలసి వుండలేవో అలా అధ్యాత్మికత, లౌకికత్వం కలసి వుండలేవంటారు. మరి అలాంటి అధ్యాత్మిక గ్రంథం ఇలాంటి స్థితిలో వుండి ఎలా రాయగలిగారు?"

"ఏముంది? అనేక పురాణాలు, ధర్మశాస్త్రాలు, మతగ్రంథాలు, భాష్యాలు చదివి, వాటిని వంట పట్టించుకుంటే ఏ రచయితకైనా ఇలాంటి గ్రంథాలు రాయడం తేలికే కదా?" చెప్పాడాయన చిరునవ్వుతో.

"మరి మీరు వంటపట్టించుకుని రాసిన ఆ విషయాలు మిమ్మల్ని ప్రభావితం చేయలేదా?"

"అదా మీ సందేహం? లేదు. కమ్మరి శ్రమించి ఎంతో పదునైన కత్తులు తయారుచేస్తాడు. కానీ తను స్వయంగా వాటితో యుద్ధం చేయడు కదా? కత్తి యుద్ధంలో ఆరితేరినవారి కోసమే అవి. ఇదీ అంతే."

తిరిగి వెళ్తూ రైల్లో అనుకున్నాడు రామకృష్ణ.

'అప్పలరాజు కమ్మరి. తను యుద్ధం నేర్చిన వీరుడు.'

## 22. కష్టాల మూట

ఓ మనిషికి పాపం అన్నీ కష్టాలే! చేసే ఉద్యోగంలోంచి సస్పెండ్ అయాడు. భార్య విడాకులకి నోటీస్ పంపించింది. తల్లికి కేన్సర్ అని తేలింది. చెల్లెల్ని మోసం చేసినతను మొహం చాటేసాడు.

ఆ మనిషికి దేవుడంటే నమ్మకమూ లేదు. అప నమ్మకమూ లేదు. అందుచేత తల్లి సలహా మీద గుడికి వెళ్ళి దేవుడ్ని ప్రార్థించాడు.